# గుండె గుండెకీ మధ్య

స్టేషన్లో రైలాగ్గానే దిగేడు వెంకట్రామయ్య.

ఇష్టం లేకున్నా అత్తారింటికి వెళ్ళక తప్పక వెళ్ళే కొత్త పెళ్ళికూతురిలా దిగేడు. ఆయన్ని చూస్తే బీదవేషం వేయటానికి ఎంతో శ్రమపడి మేకప్ చేసిన నటుడిలా కనిపిస్తారు. బాగా మాసిన చొక్కా, అక్కడక్కడా కుట్టిన చిరుగుల పంచా, కుట్టవలసిన అవసరం లేకముడతల్లో దాగిన చిరుగుల పైపంచా, చేతిలో ప్లాస్టిక్ చేతిసంచీ, ముక్కుపైకి జారుతున్న కళ్ళద్దాలు ఆయన్ని చూడగానే ఆయన అంతస్థుని చాటుతాయి.

ఎవరు దిగినా ఎవరెక్కినా నాకేం సంబంధం 'నిమిత్త మాత్రం భవ సవ్య సాచిన్' అన్న గీతోపదేశం విన్న దానిలాగా రైలు వెళ్ళిపోయింది. మెల్లిగా బయటికి నడిచాడు వెంకట్రామయ్య.

"పెదనాన్నా!"

హఠాత్తుగా ఆగేడు ఆ పిలుపుకి.

"పెద నాన్నా!"

దగ్గరిగా వినిపించి తలతిప్పి చూసేడు.

మసక కళ్ళకి వెలుగొచ్చినట్టుగా కనిపించేడు రామం. కాని వెంకట్రామయ్యగారికి అతనలా కనిపించటం యిష్టంలేనట్టుగా ఉంది, ముఖం చిట్లించేడు. అయితే రామం అది గమనించలేదు.

ఆనందంగా "ఈ రైల్లో దిగేవా పెద్దనాన్నా? పెద్దమ్మ, అక్కయ్యా బావున్నారా? పెద్దమ్మకి కీళ్ళనొప్పులెలా వున్నాయ్? అక్కయ్యకి యింకా ఫిట్స్ వస్తున్నాయా? బావ బావున్నాడా? అన్నట్టు నీ నడుం నొప్పి ఎలా ఉంది ? తమ్ముడు బావున్నాడా ? ఏం చేస్తున్నాడు? వాడికి పిల్ల లెంతమంది ?" కెనడియన్ రైలింజన్లా అడిగేడు.

వెంటనే సమాధానం ఇవ్వలేదు వెంకట్రామయ్య.

మళ్ళీ రామమే అన్నాడు "నేనిక్కడ స్టేషన్ మాస్టరుగా వుంటున్నాను. నా కిద్దరే పిల్లలు. పెద్దాడు ఎం.బి.బి.యస్. మొదటి సంవత్సరం చేస్తున్నాడు. అమ్మాయికి పెళ్లయ్యింది.

అల్లుడు టి.సి. పక్క స్టేషన్లోనే వాళ్ళుండేది. చూచి రావాలంటే కొన్ని నిముషాల ప్రయాణం అంతే ! పద ! పద ఇంటికి వెళదాం. మీ కోడలు మిమ్మల్ని ఎప్పుడూ అనుకుంటూ వుంటుంది. మిమ్మల్ని తీసుకుని రాలేదని దెప్పుతూ వుంటుంది."

ఒక్క క్షణం ఆగి "మళ్ళీ వస్తాలేరా రామం వూర్లోకి వెళ్లిరావాలి ముందు" అన్నాడు.

రామం ముఖం మాడిపోయింది.

"ఎక్కడికి పెద్ద నాన్నా?"

"కృష్ణ వద్దకి"

"కృష్ణ యిక్కడున్నాడా? ఏం చేస్తున్నాడు?" ఆత్రంగా అడిగాడు.

"మునిసిపల్ కమీషనర్‌గా వున్నాడు."

"అరే! చూడు విచిత్రం. నేనిక్కడ ఆరేళ్ళుగా వుంటున్నాను. అయినా ఒక్కరోజూ వూళ్ళోకి వెళ్ళలేదు. మా జీవితాలింతే ! వెలివేసినట్టుగా వూరికి దూరంగా క్వార్టర్స్‌లో వుంటాము. వూళ్లోకి వెళ్ళే అవసరం ఉండదు. పిల్లల చదువులకి మా మిక్సెడ్ స్కూలు ఉంది. ఏం కావాలన్నా స్టోర్సు వుంటుంది ఇక గుడ్డలు కావాలంటే పట్నం వెళతాం. పాసు వుంది కదా చార్జీల గొడవ లేదు. ఉదయం వెళితే రాత్రికి తిరిగొచ్చెయ్యొచ్చు. అయినా ఏం జీవితాలో చూడు ! అన్నదమ్ముల పిల్లలం అన్నదమ్ములం ఒకే వూళ్ళో ఉండి కూడా ముఖాలు చూసుకోలేదు."

అసహనంగా కదిలేడు వెంకట్రామయ్య.

"నేను వాడి దగ్గరికి అర్జెంటుగా వెళ్లాలిరా! మళ్ళీ సాయంకాలం రైలుకే వెళ్ళాలి. చాలా అర్జంటు అప్పుడే పది కావస్తోంది. వాడు ఆఫీసుకి వెళ్ళిపోతే నా పని అంతా వ్యర్థం అవుతుంది." అని రామం మాటకి ఆగకుండా కదిలి గేటు దాటాడు వెంకట్రామయ్య.

చివుక్కుమున్న మనస్సుతో ఆగిపోయాడు రామం.

గబగబా యింటికి వెళ్ళి "కమలా! కమలా!" అని పిలిచేడు.

తలుపు తీసిన వెంటనే, "కమలా, మా పెదనాన్న వచ్చేరు. ఇన్నేళ్ళకి మనం పిలవకుండానే వచ్చారు" అన్నాడు.

కమల ముఖం ఆనందంతో వెలిగింది. "ఏరీ!" అంది ఆత్రంగా.

కొద్దిగా చిన్న బుచ్చుకున్న ముఖంతో "వూర్లోకి వెళ్ళేడు. మా తమ్ముడు కృష్ణ యిక్కడే వున్నాట్టలే. అక్కడికి వెళ్ళి వస్తానన్నారు" అన్నాడు.

"అదేమిటండీ! ఇంటికి వచ్చి కాళ్ళు, ముఖం కడుక్కుని కనీసం కాఫీ అయినా పుచ్చుకుని వెళ్ళొచ్చుగా?" అంది విచారంగా.

"ఆయన ఎప్పుడూ అంతే! నా మీద ప్రేమ చూపేవాళ్ళు కాదు. తల్లీ తండ్రీ లేని నేను వాళ్ళపై పడ్డానని బాధ పడేది పెద్దమ్మ. ఆయన తమ్ముడ్ని మరదల్ని నేనే మింగినట్టుగా బాధపడేవారు ఈయన. వారాలబ్బాయికి పెట్టినట్టుగా పెట్టేవారు. కానీ నేను అవన్నీ

గుర్తుంచుకునేవాడిని కాదు. అనాధగా ఆశ్రమాల్లో, రోడ్లల్లో బ్రతికే బ్రతుకు తప్పినందుకు సంతోషించేవాడిని. కష్టపడి చదివే వాడిని. అందుకే ఎప్పుడూ ఫస్ట్‌గా వుండేవాడిని. ఎసెస్సెల్సీలో అయిదొందల మార్కులు రాగానే పోస్టల్ కి ఎప్లై చేయగానే ఉద్యోగం దొరికింది. వెళితే వాలు అన్నట్టుగా వుండిపోయారిద్దరూ. చాలామంది పై చదువులు చదివి ఇంజనీరుని కమ్మన్నారు. అయినా ఉపాధ్యాయుల సలహా కంటే స్థోమత ముఖ్యం అనుకుని పోస్టల్లో చేరిపోయాను. తర్వాత ప్రయివేటుగా ఎం.ఏ చేసి యీ రైల్వేలోకి వచ్చాను."

కమల మాట్లాడ్లేదు.

"కమలా! మళ్ళీ సాయంత్రంపూట రైల్లో వెళతార్ట ఆయన. ఏదైనా స్వీటు తయారుచెయ్. ఆయనకి స్వీట్సంటే చాలా యిష్టం. దొడ్లో కొబ్బరికాయలు తెంపి బర్ఫీ కూడా చెయ్ అదంటే ఆయనకు నోరూరుతుంది. మిరపకాయ బజ్జీలు చెయ్ దొండకాయ వేపుడు చెయ్. వీలయితే భోజనం చేస్తారు. నేను వెళుతున్నాను" అని హడావిడిగా వెళ్ళిపోయారు.

భర్త కళలు తెలిసిన కమల ఆశ్చర్యపోలేదు. ఆయన అభిరుచికి అనుగుణంగా తయారు చెయ్యటానికి వెళ్ళింది.

✧ ✧ ✧

రైలు స్టేషన్ దాటగానే రిక్షావాళ్లు చుట్టుముట్టేరు వెంకట్రామయ్యని. ఎవరికి సమాధానం యివ్వకుండా కాస్త ముందుకి నడిచి ఒక్కడే వున్న రిక్షా దగ్గరికి వెళ్ళేరు.

"బాబూ! మునిసిపల్ కమీషనర్ గారిల్లు తెలుసా?"

"ఓ!"

"రిక్షా కడతావా?"

"వూఁ"

ఎక్కి కూర్చుని "పద బాబూ" అన్నారాయన.

కానీ అతను ఎక్కకుండా "రూపాయవుతుంది" అన్నాడు.

"అంత దూరమా?"

"అవును."

"సరే పద"

రిక్షా కదిలింది.

పది గజాలు సాగగానే "నీకు ఆ యిల్లు తెలుసా?" అని మళ్ళీ అడిగేరు.

"ఇల్లేమిటండి! బంగళా అది! బంగళా! మునిసిపాల్టీ వాళ్ళు కమీషనర్ గారి కోసం కట్టించారు. ఛైర్మన్ గారి తప్పులు కాయటానికి కమీషనర్ని బుట్టలో వేయ్యటానికి కట్టించారది. ఇక్కడ యింతగా ఎండ మండిపోతుందా ? ఆయన హిమాలయాల్లో వున్నంత చల్లగా వుంటారు గదిలో. ఎందుకో తెలుసా ? ఏర్ కూలర్స్ వున్నాయి గది గదికి."

వెంకట్రామయ్యగారు మాటాళ్ళేదు. కానీ ఆయన మనస్సు మాత్రం తృప్తిగా నిట్టూర్చింది. అయితే ఆ క్షణాన తన యింటి దీనావస్థ గుర్తొంచింది మనస్సు మూలిగింది.

మరో అయిదు నిముషాలు గడిచాయ్. రోడ్లు దాటి వెళుతున్నారు షాపులు, థియేటర్లు, పెద్ద పెద్ద మేడలు వెనకబడి పోతున్నాయ్.

"ఇంకా ఎంత దూరం బాబూ! యిల్లు బాగా తెలుసా?"

ఆ ప్రశ్నకి సడన్‌గా బ్రేకు వేసి "బాబుగారూ! మునిసిపల్ కమీషనర్ యిల్లు, ఆస్పత్రి, మునిసిపల్ ఆఫీసు, కలెక్టరాఫీసు, తాలుకాఫీసు, సినిమాహాళ్ళు, పోలీస్ స్టేషన్, కోర్టు, రిజిస్ట్రరాఫీసు, బస్టాండు, స్టేషన్ యివి రిక్షావాళ్ళు నిద్రపోతూ కూడా వెళ్ళగలిగిన చోట్లు. మీకేం భయం లేదు." అని మళ్లీ రిక్షా తొక్కటం ప్రారంభించేడు.

స్వచ్ఛంగా మాట్లాడుతున్న అతడి భాష చూసి "చదువు కున్నావా?" అని అడిగేడు వెంకట్రామయ్య.

"ఆఁ టెన్త్ పాసయ్యా. ఫస్ట్ క్లాసులో. అయినా పైకి చదివించే స్తోమత లేదు మా నాన్నకి. ఉద్యోగం దొరకలేదు నాకు. స్టేట్ బ్యాంకులో సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ క్రింద ఈ రిక్షా తీసుకున్నా. రోజూ పది బ్యాంక్‌కి కట్టినా హీనంగా పది మిగులుతాయి. మా నాన్నకి వచ్చే పెన్షన్ ఈ డబ్బూ కలసి నాకూ, మా అమ్మకూ, చెల్లికి, నాన్నకి చాలు నేను రాత్రి కాలేజీలో యింటర్ చదువుతున్నా. మా చెల్లెలి పెళ్ళి ఖాయం అయింది. కట్నం రెండు వేలు. పెళ్ళి ఖర్చు వాళ్ళదే. ఇంకో నెల రోజులుంది పెళ్ళి. కట్నం డబ్బు ఈ మూడేళ్ళలో దాచింది చాలు. కానీ ఎంత లేదన్నా మరో రెండు మూడొందలు ఖర్చు వుంటుంది. అది యీ నెలలో సంపాదించాలి." అని రిక్షా ఆపి, "అదిగో, అదే బంగళా!" అన్నాడు.

రూపాయి చేతిలో పెట్టేసి. "నీ పెళ్ళి నీ చెల్లి పెళ్ళి సుఖంగా జరుగనీ" అని వెళ్ళేడు ముందుకి.

చుట్టూ ప్రహారీ గోడతో చాలా అందంగా వుంది బంగళా. ముందు గూర్ఖా వుండి వుంటే అది ఏ సినిమా నటుడి యిల్లో అన్నట్టుగా వుంది. గేటు వద్ద గూర్ఖా లేకున్నా వరండాలో మాత్రం జవాను వున్నాడు. 'ఇంకా టయం అయినట్టు లేదు. ఇంట్లోనే వున్నట్టుంది.' అనుకున్నాడు వెంకట్రామయ్య.

అంతలో పిల్లవాడిని తీసుకుని వచ్చింది ఓ స్త్రీ బయటికి. కుందన బొమ్మలా వుంది ఆమె. అంతవరకూ కోడలు ముఖం చూడకపోయినా ఆమె 'తన' కోడలే అయివుంటుంది అనుకున్నాడాయన.

ఆ బాబు కూడా డాల్‌లాగా వున్నాడు. తెల్లని వొళ్లు, నల్లనికళ్ళు, గీచినట్టున్న ముక్కు, వుంగరాల వెంట్రుకలు... అచ్చం చిన్నప్పుడు కృష్ణలాగే వున్నాడు. కానయితే కృష్ణ కొద్దిగా నలుపు. మనవడికి కోడలి రంగొచ్చింది అనుకున్నాడు.

"సీతయ్యా! బాబుని కాన్వెంట్‌లో వదిలేసిరా!"

వీణ మీటినట్టుగా వుంది ఆ స్వరం.

"టా! టా! మమ్మీ."

వెంకట్రామయ్య తన జన్మ ధన్యమైందనుకున్నాడు ఆ కాస్తకే. అంతలో కారు దూసుకుని వచ్చింది అక్కడికి గేరేజ్ నుంచి.

డ్రైవింగ్ సీట్లో వున్న కృష్ణని గుర్తుపట్టారు ఆయన.

'కృష్ణ కూడా రంగు తేలాడు.'

డోర్ తీసి 'నేనొదిలేస్తాలే' అన్నాడు కృష్ణ.

'ఆఫీసుకు వెళుతున్నాడు' అనుకుని గబగబా నడిచాడు.

"ఏయ్! ఏయ్! తప్పుకో. ఎవరున్నువ్వు. అయ్యగారిని ఆఫీసులో కలుసుకో. ఇంటి దగ్గరికి ఎవ్వరూ రాకూడదని తెలీదూ?"

జవాన్ మాటలతో బిక్కచచ్చిపోయాడు ఆయన. ఆ మాటలకి అటుచూసిన కృష్ణ వెంటనే తండ్రిని గుర్తించేడు. అతని భార్య మాత్రం నిర్వికారంగా కొడుకుని కార్లో కూచోబెడుతూ వుంది.

గబగబా కారుదగ్గరికి నడిచి "కృష్ణా" అన్నారాయన.

"ఏం యిలా వచ్చారు?" సూటిగా ప్రశ్నించాడు.

షాకు తిన్నట్టై "కృష్ణా" అన్నాడు బాధగా.

"ఏం యిప్పుడు అవసరమయ్యానా నేను? ఇన్నేళ్ళూ మీకు గిట్టనివాడినేగా? కులాంతర వివాహం చేసుకున్నానని వెలివేశారే యిప్పుడేం అవసరం వచ్చింది? చెల్లాయి పెళ్ళికా ? అమ్మ జబ్బుకా? డబ్బు కావాలి కదూ! నేనూ నా భార్యా నా బిడ్డలూ మీకు అక్కర్లేదు. మేం అంటరాని వాళ్ళమయ్యాం మీకు. కానీ డబ్బు మాత్రం అలాకాదు కదూ!"

ఒక్కోమాటా బాణంలా దూసుకొచ్చింది.

క్షతగాత్రుడిలా అయ్యారాయన.

"మామగారూ!" అప్రయత్నంగా!" పిలిచిందామె.

"వందనా!" కఠినంగా పిలిచాడు కృష్ణ.

"ఎవరు మామగారూ! ఎవరు కోడలు ? డోంటాక్ రబ్బిష్. మనకీ వాళ్ళకీ చుట్టరికాల్లేవు. మనం వాళ్ళు వేరు వేరు. అవసరాలకి దగ్గరికొస్తే బంధుత్వాలు కలియవు. గుర్తుంచుకో. మీరు వెళ్ళిరండి. నేను ఆఫీసుకు వెళ్లాలి."

కారు స్టార్టు చేయబోయాడు.

అభిమానం పూర్తిగా చచ్చిన వెంకట్రామయ్య "బాబూ!" అన్నాడు మళ్ళీ.

"నేను మాటల మనిషిని కాను. నా కొకటే మాట! ఒకటే ధర్మం! ఒకతే భార్య!"

రివ్వున కారు దూసుకుపోయింది.

వెంకట్రామయ్య ముఖం దుమ్ము కొట్టి వెళ్ళింది.

పై పంచతో ముఖం తుడుచుకుని వెనుదిరిగాడు. అంతరాంతరాల్లో యిక్కడ జరిగేది ఛీత్కారమేనని అనుకుంటూ వున్నా మరీ యింత ఘోరంగా జరుగుతుందని అనుకోని వెంకట్రామయ్య మనస్సు బాగా గాయపడింది. అందుకే వందన పిలుస్తున్నా, వినిపించుకోకుండా ముందుకే కదిలేడు. ఒకనాడు తాను నిర్దాక్షిణ్యంగా తిరస్కరించిన కొడుకు వద్దకి రావటమే దౌర్భాగ్యం! ఇక్కడ చెప్పుచ్చుకు కొట్టినట్టుగా జరిగిన సత్కారమే చాలు ! ఇంకా ఆమె పరామర్శలా ! కొన్ని నిమిషాల క్రింద మనవడిని ఎత్తుకుని, ముద్దాడాలని వచ్చిన వూహకే కూడా కించపడ్డాడు. బరువుగా కాళ్ళీడ్చుకుంటూ స్టేషన్ వైపు కదిలాడు.

✧ ✧ ✧

సాయంకాలం! రైల్లో కూర్చున్నాడు వెంకట్రామయ్య.

"భద్రం పెదనాన్నా! జాగ్రత్త మామయ్యా!" అంటున్న రామం, కమలల మాటలు దూరమయ్యేయి. రైలు వేగం పుంజుకోవటంతో, రైలు వేగం పుంజుకుని ప్లాట్ ఫాం దాటి వెళ్ళిపోయింది. వాళ్ళిద్దరూ చేతులు వూపుతూనే వున్నారు బాగా కనుమరుగయ్యేదాకా!

జేబులోంచి రామం యిచ్చిన చెక్కు తీసి చూసుకున్నాడు. "పదివేలు! ఒక్కక్షణంలో వెనకా ముందూ ఆలోచించకుండా చెక్కు రాసిచ్చాడు. ఈ డబ్బుతో సత్యవతి పెళ్ళి నిర్విఘ్నంగా జరిగిపోతుంది" మళ్ళీ చెక్కు తీసి జేబులో పెట్టుకున్నాడు.

సంచి తెరిచాడు. లడ్డుండలు ! తనకి లడ్డూపై ఎక్కువగా కనిపించేట్టు జీడిపప్పు, ద్రాక్ష వుంటే చాలా యిష్టం! కొబ్బరి బర్ఫీ! అది బళ్ళు కొద్దీ తినాలన్నంత తాపత్రయం తనకి... ఓ కేజీ దాకా వుంటాయి రెండూ! మిరపకాయ బజ్జీలు! పొట్లం బాగా పెద్దగా వుంది.

కొత్త పంచల జత ! జరీ కండువా! పొందూరు చొక్కా గుడ్డ. తానెప్పుడు ఖద్దరు ధారి. గాంధీ గారికిచ్చిన మాట ఆజన్మాంతం నిలుపుకుంటున్నాడు.

అవన్నీ చూసిన ఆయన మనస్సు పాడైపోయింది.

గతం.... ప్రస్తుతం.... గిరగిరా తిరిగేయి.

మెల్లిగా జేబులోంచి చెక్కు తీసి రెండుగా చించేడు. తర్వాత సాధ్యమైనంత ముక్కలు ముక్కలుగా చించి విసిరేశాడు. పదివేలు గాల్లో కలసిపోయాయి. ఆ తర్వాత స్వీట్సు, బజ్జీలు గాల్లోకి, ఆ తర్వాత పంచలు, చొక్కా గుడ్డ, ఉత్తరీయం బయటికి గిరాటేశాడు.

పిచ్చివాడిని చూసినట్టుగా చూస్తున్న తోటి ప్రయాణీకులవైపు చూళ్లేక కళ్ళు మూసుకుని అటు తిరిగేడు. అవిరళ ధారగా కురుస్తోన్న కన్నీళ్ళు ఆయన మాసినచొక్కాని తడుపుతున్నాయ్.

అవమానమేకాదు. ఆదరం కూడా బరువే! ఆ బరువు దించుకున్న ఆయన మనస్సు మెలమెల్లిగా తేలికపడుతోంది.

● యువ మాస పత్రిక సెప్టెంబరు 1980 ●